పేదలకు అన్యాయం చేసే అవినీతిపరులను వదిలిపెట్టేది లేదు

సుస్థిర విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, జనవరి 25 : పేదలకు అన్యాయం చేసే అవినీతిపరులను వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల సేంద్రియ తినుబండారాల స్టాళ్లను, 601 గాంధీ విగ్రహాల ప్రతిమలను, ఎద్దుగానుగ నూనె తయారీ, బట్టలు తయారు చేసే రాట్నాలను తిలకించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం అడ్డుపెట్టుకొని ప్రభుత్వ, పేదల సొమ్ము జోలికిపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు . గోడలమీద ఫొటోలు, ఫ్లెక్సీలు కాదు మంచి పనులు చేస్తే ప్రజల హృదయాల్లో నిలుస్తారని తెలిపారు. ఆస్తులు అంతస్తులు కాదు ఆరోగ్యమే ప్రజలకు ముఖ్యమని, ఈ ప్రాంతంలో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు అధికంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విషయంలో స్థానిక నాయకులు రాజీపడవద్దని, కాలుష్య పరిశ్రమల నిర్మూలనకు ప్రజాప్రతినిధులు పనిచేస్తే ప్రజలు మెచ్చుకుంటారని ఆయన చెప్పారు.

సమావేశంలో భాగంగా సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ఆదివారం ముగిస్తుండంతో వారందరికీ సన్మానం చేశారు. అనంతరం చౌటుప్పల్ పట్టణంలోని బంగారిగడ్డలో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన రాయల్ యూత్ భవనాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. తంగడపల్లిలో రోడ్డులోని నాగుల కుంట సమీపంలో నేతాజీ సుభాశ్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి సంస్థ ఇతర ప్రతినిధులు కేవీబీ కృష్ణారావు, వెన్‌రెడ్డి సంధ్యా, ఉజ్జిని మంజుల పాల్గొన్నారు.

'లక్ష డప్పులు..వేల గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలి'

మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రస్వామి

ఆత్మకూరు(ఎం), జనవరి25 : ఈ నెల 28న భువనగిరిలో, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష డప్పులు వేల గొంతుల ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి అన్నారు. మండలంలోని సింగారంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ... ప్రతి గ్రామం నుంచి మాదిగలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికేందుకు లక్ష డప్పులు, వేలగొంతుల ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగస్వామి, యాదయ్య, విజయ్, ఇసాక్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

రాజాపేట బాలికల జడ్పీ హైస్కూల్‌లో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థులు

రాజాపేట, జనవరి 25 : మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ వేసే విధానం, కౌంటింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులురాలు కిరణ్మయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జై భవాని జ్యువెల్లరీ బాధితులు 156 మంది

● 3 కిలోల బంగారం.. రూ. 1.20 కోట్ల నగదుతో పరారీ!

యాదగిరిగుట్ట, జనవరి25 : జై భవాని జ్యువెల్లరీ నిర్వాహకుడు జితేందర్ సింగ్ రాథోడ్ చేసిన మోసం భారీగానే ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. పెద్దమొత్తంలో బంగారం, నగదుతో ఉండాయించిన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌కు 156 మందికి పైగా బాధితులు ఫిర్యాదు చేసిన్నట్లు సమాచారం. వీరిచ్చిన వివరాల ప్రకారం 3 కిలోల 100 గ్రాముల బంగారం, రూ. 1.20 కోట్ల నగదుతో ఉండాయించిన్నట్లు సమాచారం. బాదితుల ఫిర్యాదు ప్రకారం జ్యువెల్లరీ నిర్వాహకుడు జితేందర్ సింగ్ రాథోడ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే పోలీసు బృందం నిందితుడి ఆచూకీ వెతికే పనిలో పడ్డారు. గుట్టతోపాటు జిల్లా, ఇతర ప్రాంతాల్లో అతనికి సంబంధించిన బంధువులు, ఆ ప్రాంతానికి చెందిన వారి వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నారు. సమీప బంధువును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తున్నది. బంధువుల పెళ్లికి వెళ్తున్నానని షాపు వద్ద వారి బంధువులకు చెప్పి వెళ్లాడని సీఐ రమేశ్ తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆధారాలు సేకరిస్తున్నామన్నారు. జితేందర్ సింగ్ మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తున్నదని, నిందితుడిని పట్టుకుని బాధితులకు న్యాయం చేస్తామని ఆయన వెల్లడించారు.

బంగారం వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వినతి

యాదగిరిగుట్ట : పట్టణ వాసులు తాకట్టు పెట్టిన బంగారం, వడ్డీలకు, అభరణాలు చేయించుకునేందుకు ఇచ్చిన డబ్బులతో ఉండాయించిన జ్యువెల్లరీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం అడ్మినిస్ట్రేషన్ అధికారి జగన్ మోహన్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఇతర రాష్ట్రాలకు చెందిన బంగారం వ్యాపారస్తులు దుకాణాలు తెరిచి స్థానిక ప్రజల నుంచి పెద్ద మొత్తం బంగారం, డబ్బులతో పరారవుతున్నారని అన్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికే పలుమార్లు జరిగాయని, తాజాగా జై భవాని జ్యువెల్లరీ వ్యాపారి రూ. 10 కోట్ల విలువైన నగదు, బంగారంతో ఉడాయించారని తెలిపారు. తాకట్టు పెట్టిన రసీదులపైన లెసెన్స్ నంబర్ నమోదు చేయలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ అందజేత

విద్యార్థులకు షూస్ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు గుణగంటి బాబురావుగౌడ్

యాదగిరిగుట్ట, జనవరి 25 : మండలంలోని మాసాయిపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన గుణగంటి బ్రదర్స్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుణగంటి బాబురావుగౌడ్ షూస్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుణగంటి సైదులు, వాకిటి కిష్టయ్య, బండ భాస్కర్, సొప్పరి మధు, బండ బాలసిద్దులు, ఎండీ బోలేపాషా, మైలారం స్వామి, బల్ల ప్రవీణ్, తోటకూరి కరుణాకర్, బండి బాను, కటకం బాలగిరి, మైలారం బాబు పాల్గొన్నారు.

'విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

రామన్నపేట, జనవరి25 : విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్1104 యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు పి.యాదగిరి, ఎస్.అమర్‌నాథ్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సబ్ డివిజన్ ఎన్నిక కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. అనంతరం నూతన సబ్‌డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రామన్నపేట సబ్‌డివిజన్ లీడర్‌గా నల్ల రాములు, వలిగొండ సెక్షన్ లీడర్‌గా గాజుల మహేశ్, రామన్నపేట లీడర్‌గా ఎండీ చాంద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆలె రమేశ్, గంగుల సోమేశ్వర్‌రెడ్డి, నాయకులు కూనూరు మహేశ్, మేకల సురేశ్, యాదయ్య, సత్తిరెడ్డి, వేణు, మిర్జా అర్షద్ బేగ్ పాల్గొన్నారు.

ఆలేరు మున్సిపాలిటీలో పార్టీలకతీతంగా పాలన

● మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

● మున్సిపల్ పాలకవర్గానికి ఘన వీడ్కోలు

మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, జనవరి 25 : ఆలేరు మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సుస్థిర పాలన అందించడం కేవలం వస్పరి శంకరయ్యకే సాధ్యమని మాజీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య వీడ్కోలు అభినందన సభలో శనివారం ఆమె మాట్లాడారు. రూ.55కోట్ల వ్యయంతో ఆలేరును అభివృద్ధి చేశారన్నారు. మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.3కోట్లు, అండర్ డైనేజీ నిర్మాణానికి రూ.9కోట్లు, వివిధ కాలనీల్లో సీసీ రోడ్లకు రూ.3కోట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం మారడం వల్ల రూ.20కోట్లు నిలిచిపోయాయని అన్నారు. ఎన్నో ఒడుదుడుకులను అధిగమించి, వివిధ పార్టీలకు చెందిన కౌన్సిలర్లను సమన్వయం చేస్తూ మంచి పాలన అందించారని అభినందించారు. మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వస్పరి శంకరయ్య మంచి పరిపాలన అనుభవం కలిగిన వ్యక్తి అని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణ పాఠం తప్పదన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను, కౌన్సిలర్లను శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, వైస్ చైర్మన్ మొరిగాడి మాధవీవెంకటేశ్, కౌన్సిలర్లు, కమిషనర్ లక్ష్మి, మాజీ కమిషనర్ చక్రపాణి, శారద, జగన్ మోహన్, పాల్గొన్నారు.

భువనగిరి మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు

భువనగిరి అర్బన్, జనవరి 25: భువనగిరి మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుల 5 సంవత్సరాల పదవీ కాలం నేటితో ముగియనుంది. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో సీసీ రోడ్డు, మురికి కాల్వల నిర్మాణం చేపట్టేందుకు వార్డుకు రూ.10 లక్షల చొప్పున కేటాయించి చివరి తీర్మానం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

సీసీ రోడ్ల పనులు పరిశీలిస్తున్న భువనగిరి పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ

మోత్కూరు, జనవరి 25 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను భువనగిరి పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ఎస్‌బీఐ వరకు రోడ్డు డివైడర్‌కు ఇరువైపులా సీసీ, మిగతా రోడ్డు బీటీ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. జగ్జీవన్ రామ్ చౌరస్తా నుంచి బస్టాండ్ సమీపంలోని పెద్దమ్మ ఆలయం వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్ల తొలగింపును పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంజీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రామగిరి, జనవరి 25: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 30 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరగాల్సిన వివిధ పీజీ కోర్సులు, ఎంసీఏ, లా పరీక్షలను వాయిదా వేసినట్లు వర్సిటీ సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల 1, 3, 5, 7 సెమిస్టర్స్ పరీక్షలను ఫిబ్రవరి 8 నుంచి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందుకు సందించిన టైంటేబుల్‌ను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆత్మకూర్.ఎం మండలంలో 1,691 దరఖాస్తులు

ఆత్మకూరు(ఎం), జనవరి 25 : ప్రభుత్వం గతంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల నుంచి 6 గ్యారెంటీల పథకాల కోసం 10,694 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 21నుంచి 24వరకు నిర్వహించిన గ్రామ సభల్లో 4 పథకాల కోసం 1,691 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్ కార్డుల కోసం 626, ఇందిరమ్మ ఇండ్ల కోసం 807, రైతు భరోసా కోసం 42, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 216 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

కంప్యూటర్ ఆపరేటర్‌కు జిల్లా ఉత్తమ అవార్డు

రాజాపేట, జనవరి 25 : స్థానిక తాల్దార్ కార్యాలయంలో కంప్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌కు శనివారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతరావు ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా శేఖర్‌కు తాసీల్దార్ దామోదర్, డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు నర్సింహులు, రమేశ్, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

రవితేజ కుటుంబానికి మాజీ స్పీకర్ పరామర్శ

అమెరికాలో మృతి చెందిన రవితేజ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మధుసూదనాచారి, పల్లె రవికుమార్

చౌటుప్పల్‌రూరల్, జనవరి25 : చౌటుప్పల మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ రవితేజ ఇటీవల అమెరికాలో దుండగుడి కాల్పులో మృతి చెందగా ఆయన మృత దేహం శనివారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని గ్రీన్‌హిల్స్ కాలనీలో మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సి.మధుసూధనాచారి, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ పరామర్శించారు. రవితేజ మరణం పట్ల సానుభూతి వ్యక్తంచేశారు. వారితోపాటు బీఆర్ఎస్ నాయకులు కొండపర్తి బాలబ్రహ్మచారి, నగేశ్, నీల లింగస్వామి, పొనుగంటి విజయ్‌కుమార్, కార్తీక్, కొయ్యడ వెంకటరమణ తదితరులు ఉన్నారు. రవితేజ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం కొయ్యలగూడెంలో జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్

బీబీనగర్, జనవరి 25 : మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామంలో గల రుక్మిణి సత్యభామ సమేత వ్రేణుగోపాల స్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేయగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కన్న మాదన్నల కాలంలో నిర్మించిన అతి పురాతన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆలయ ఈఓ రుద్ర వెంకటేశం నూతన కమిటీ చైర్మన్ కవాడపు శివారెడ్డి, ధర్మకర్తలు దండెం ప్రభాకర్, దండెం రవీందర్, జస్వంత్ సింగ్, గాండ్ల నాగేశ్, మునిగళ్ల కొండల్, కందాడి రవణమ్మ, కోఆప్షన్ సభ్యుడు శ్రీమన్నారాయణ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రామంలో నాయకులు గోలి పింగళ్‌రెడ్డి, పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పిడియాట్రిక్ విభాగంలో అరుదైన శస్త్ర చికిత్సలు

● బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, జనవరి 25 : పీడియాట్రిక్ విభాగంలో రోగులకు అరుదైన శస్త్ర చికిత్సలు చేపడుతున్నామని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్‌ను స్థాపించిన కొద్ది వ్యవధిలోనే, వైద్య బృందం క్లినికల్ బ్రిలియెన్స్‌ను ప్రదర్శించడమే కాకుండా అరుదైన, సంక్లిష్టమైన కేసులను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వెస్టిజియల్ మానవ తోకను శస్త్రచికిత్స ద్వారా తొలగించడం అసాధారణమైన ఫీట్‌గా నిలుస్తుందని, గత సంవత్సరం ఇటువంటి రెండు శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిగాయని పేర్కొన్నారు. అదనంగా టెస్టిక్యులర్ ట్యూమర్, విల్మ్స్ ట్యూమర్ ఆంకాలజీ కేసులు, రోగులకు సరైన ఫలితాలను నిర్ధారిస్తూ, కచ్చితత్వంతో జాగ్రత్తతో చికిత్స చేసినట్లు తెలిపారు. హెర్నియా, హైడ్రోసెల్, హైపోస్పాడియాస్ వంటి సాధారణ పరిస్థితులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. నియోనాటల్ డొమైన్‌లో, అత్యవసర పరిస్థితుల్లో అనోరెక్టల్ వైకల్యాలు, టాకియోసోఫాగియల్ ఫిస్టులాస్ కోసం క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడంలో విభాగం అద్భుతంగా పనిచేస్తున్నదన్నారు. ఈ బృందంలో ఎయిమ్స్ ఢిల్లీ డాక్టర్ శశాంక శేఖర్ పాండా, పీజీఐ ఛండీగఢ్ మానస రెడ్డి తోపాటు దేశంలోని ప్రముఖ వైద్య సంస్థలలో శిక్షణ పొందిన సర్జన్లు ఉన్నారని తెలిపారు.

గీత కార్మికులకు ఆర్థిక సహకారం అభినందనీయం

● కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని

ఆర్థిక సాయం అందజేస్తున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సభ్యులు

మోటకొండూర్, జనవరి 25 : గీత కార్మిక కుటుంబాలకు అండగా ఉంటూ ఆర్థిక సహకారం అందిస్తున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ సేవలు అభినందనీయమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో శనివారం ఆ సంఘం అధ్యక్షుడు గాజుల బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ పిలుపుమేరకు గీత కార్మికులు కొంత, సంస్థ కొంత డబ్బులు చెల్లించి గీత కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించిన బీమా బాండులను గీత కార్మికులకు అందజేశారు.

రూ.20 వేలు అందజేత

మోటకొండూర్ మండలం నాంచారిపేట గ్రామానికి చెందిన గీతకార్మికుడు బుర్గు నారాయణగౌడ్ ఇటీవల అనార్యోగంతో మృతి చెందగా . కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా మంజూరు చేసిన రూ.20 వేలను ఆ సంస్థ స్థానిక ప్రతినిధి నాతి గణేశ్ ఆధ్వర్యంలో అందించారు. గౌడ సంఘం ఉపాధ్యక్షుడు లోడే ఉప్పలయ్య, కార్యదర్శి వంగాల స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ పాండురంగయ్య, సభ్యులు గాదెగాని నర్సింహులు, రుద్రబోయిన మల్లేశ్, లోడే మల్లేశ్, లోడే యాదగిరి, తండ రాములు, బొల్లెపల్లి సత్తయ్య, బొలగాని జహంగీర్, సీసా ఇస్తారి, గడ్డం జహంగీర్, దూడల శ్రీనివాస్, వంగాల నాగరాజు, బొలగాని శేఖర్, బస్వగాని మహేందర్, కల్లూరి సత్యనారాయణ, గణగాని నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రోడ్డు రవాణ, పోలీస్‌శాఖ అధికారులు

రామన్నపేట, జనవరి25 : వాహనదారులు రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌శ్యాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా డాన్ బాస్కో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, సుభాష్ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసన్స్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య, ఎంఈఓ జ్యోతి, పాఠశాల కరస్పాండెంట్ పీజీవీ చిట్టిబాబు, ప్రిన్స్‌పాల్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పథకాలు అర్హులకు అందేలా చర్యలు

● కలెక్టర్ హనుమంతరావు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవం నుంచి ప్రభుత్వం అందించే నాలుగు నూతన పథకాలు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి మండలంలోని ఒక గ్రామంలో 4 పథకాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రారంభించే ముందుగా సీఎం సందేశం ప్రదర్శించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగాలన్నారు. గ్రామ సభల్లో స్వీకరించిన నూతన ధరఖాస్తులను సైతం పరిశీలించి అర్హులు ఉంటే రేపటి జాబితాలో యాడ్ చేయాలని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీని తాసీల్దార్ బృందం, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ఎంపీడీఓ బృందం, రైతుభరోసా జాబితాను మండల వ్యవసాయి అధికారి బృందం, ఇందిరమ్మ రైతు భరోసా జాబితాను ఏపీఓ అధికారుల బృందం పరిశీలించి, అందులో అర్హులు మాత్రమే ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ఆడియో, వీడియో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ఎంపీడీఓలో..

యాదగిరిగుట్ట : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ, ఆర్ఐ ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన

భువనగిరి అర్బన్ : భువనగిరి మండలంలోని బండసోమారానికి శనివారం కలెక్టర్ హనుమంతరావు వెళ్లారు. గ్రామ సభలో అధికారులకు ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన వారికి పథకాలను అందజేయాలని అధికారులకు సూచించారు.

సాగు జలాల కోసం కండ్లకు గంతలు కట్టుకొని నిరసన

రాజాపేటలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న రైతులు

రాజాపేట, జనవరి 25 : కాళేశ్వరం 15 ప్యాకేజీ ద్వారా మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపాలని శనివారం మండల కేంద్రంలో రైతులు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జల సాధన కమిటీ మండలాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్ మాట్లాడుతూ తలాపున కాళేశ్వర